ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి
# జనంవార్త
TGTEL/25/A1132
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 20.07.2026 | సంపుటి : 2 | సంచిక : 18 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్




## రైతుల పాలిట రాక్షసుడు రేవంత్‌రెడ్డి

**రాజకీయాలు పక్కనబెట్టి నీరు ఎత్తిపోయండి**

**రైతులపై ఏమాత్రం గౌరవం ఉన్నా కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయాలి**

**'రైతు మహా పాదయాత్ర'లో సీఎంను డిమాండ్ చేసిన హరీశ్‌రావు**

బీఆర్ఎస్ పాలనలో రైతుల పాలిట కేసీఆర్ అపద్భాందవుడిలా మారితే, కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసుడిలా మారాడని బీఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్, హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా కాకుండా హిట్లర్‌లా వ్యవహరిస్తున్నాడని, పదవులు ఎవరికి, ఎప్పటికి శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మోటర్లను నడిపించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిద్దిపేట జిల్లా అల్లీపూర్ గ్రామం నుంచి రంగనాయకసాగర్ వరకు రైతులు పాదయాత్ర నిర్వహించారు.

సిద్ధిపేట జూలై 19 : 'కేసీఆర్‌పై పగతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు. ఏకంగా 70 టీఎంసీల నీటిని కిందికి వదిలిపెట్టారు. ఆ నీటిని ఏపీ సీఎం చంద్రబాబు పట్టిసీమ మోటార్లు ఆన్ చేసి ఒడిసి పట్టుకున్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డికి రైతులపై ఏ మాత్రం ప్రేమ, గౌరవం ఉన్నా రాజకీయాలు పక్కన పెట్టి మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలి' అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం జలాలు ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ..

-మిగతా 2 లో..

## ఆగస్టు 3 వరకు
# గాంధీభవన్‌కు రావొద్దు

**'సర్' ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తయ్యేదాకా క్షేత్రస్థాయిలోనే ఉండండి**

**25 స్థానాల్లో వెనుకబడ్డాం.. బాధ్యులు స్పందించండి**

**బీఎల్‌వోల రిపోర్టులపైనే ఆధారపడొద్దు**

**పార్టీ బీఎల్‌ఏలను సమర్థంగా ఉపయోగించుకోండి**

**కాంగ్రెస్ శ్రేణులతో జూమ్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**

సర్ ప్రక్రియకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. పెరిగిన సమయాన్ని అవకాశంగా తీసుకొని పార్టీ శ్రేణులంతా ఆగస్టు 3వ తేదీ దాకా క్షేత్రస్థాయిలో శ్రమించాలని అన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తయ్యేదాకా నామినేటెడ్ పోస్టులని, పార్టీ పదవులని ఎవ్వరూ గాంధీ భవన్‌కు రావొద్దని స్పష్టం చేశారు.



హైదరాబాద్, జూలై 19 : కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ కమిటీల్లో పదవులు కావాలని గాంధీ భవన్ చుట్టూ తిరగొద్దని, వాటి కోసం వచ్చే వారికి అపాయింట్‌మెంట్లు కూడా ఇవ్వవద్దని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'సర్ గడువును ఎన్నికల కమిషన్ వచ్చే నెల 3 వరకు పొడిగించింది. దీనిని ఒక అవకాశంగా తీసుకుని అర్హులైనవారి ఓట్లను కాపాడేందుకు పార్టీ నేతలు గట్టిగా పనిచేయాలి. ఆగస్టు 3 వరకు నాయకులెవరూ గాంధీభవన్‌కు రావద్దు. అందరూ పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి' అని నిర్దేశించారు. సర్‌పై పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఆదివారం జూమ్ ద్వారా పార్టీ నేతలతో సీఎం మాట్లాడారు. "ఈ అంశంపై పార్టీ ఆధ్వర్యంలో మొత్తం 119 నియోజకవర్గాల్లో 489 సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో

-మిగతా 2 లో..



## విరిగిపడిన కొండచరియలు

**ఎనిమిది మంది మృతి**

నాగాలాండ్, జూలై 19 : నాగాలాండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా మోన్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. మరో 12 మందికి గాయాలయ్యాయి. పది నుంచి పదిహేను ఇళ్లు దెబ్బతినగా.. శిథిలాల కింద మరింత మంది ఉండవచ్చని భావిస్తున్నారు. నాగాలాండ్ పోలీసులు సహా అస్సాం రైఫిల్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మోన్ జిల్లా కేంద్రం వణికిపోయింది. అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లు, రోడ్లు, మౌలికసదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది.



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎంకు కుడి, ఎడమ భుజాలు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, జూలై 19 : ఎంఐఎంకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుడి, ఎడమ భుజాలని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అండతో ఎంఐఎం పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఉంటున్నవారు సొంత ఊరిలో కాకుండా ఇక్కడే ఓటరుగా పేరు నమోదు చేయించుకుని తమ ఓటు హక్కు కాపాడుకోవాలని సూచించారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ

-మిగతా 2 లో..




02

## ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ తీసుకొస్తాం

**నిపుణుల సూచనల మేరకే కాళేశ్వరంపై నిర్ణయం**

**ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ**

## సాగునీటి సంస్థల బలోపేతానికి కార్యాచరణ

**నిధుల సమీకరణకు కొత్త ప్రణాళిక**

**నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ వెల్లడి**



హైదరాబాద్, జూలై 19 : సాగునీటి సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ లోని క్యాంప్ కార్యాలయంలో సాగునీటి సంస్థల ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఈఎన్సీ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

-మిగతా 2 లో..

## ఫిఫా విశ్వవిజేతగా
# స్పెయిన్..

**ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాపై విజయం**

**ఫిఫా ప్రపంచకప్ కైవసం**

**స్పెయిన్‌కు ఇది రెండో ప్రపంచకప్ టైటిల్**

08

ఫిఫా ప్రపంచకప్‌ను స్పెయిన్ సొంతం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాపై 1-0తో గెలుపొంది విశ్వవిజేతగా నిలిచింది. ఇరుజట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలకపోవడంతో.. ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. ఈ క్రమంలోనే 106వ నిమిషంలో స్పెయిన్ ఆటగాడు ఫెర్రాన్ టొర్రెస్ గోల్ కొట్టాడు. స్పెయిన్‌కు ఇది రెండో ప్రపంచకప్ టైటిల్.



# రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే

(మొదటిపేజీ తరువాయి)

నగర కార్యాలయంలో పార్టీ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అండతో రజాకార్ల పాలన తేవడానికి ఎంఐఎం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. దొంగ ఓట్లను రద్దు చేయడానికి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఈ నెల 26న కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతోందని, గ్రేటర్‌లోని మూడు కార్పొరేషన్లపై కమలం జెండా ఎగిరితీరుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయని, జీహెచ్ఎంసీలో ఎంఐఎంను గెలిపించడానికి కుట్రలు చేస్తున్నాయని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు.

# ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు రావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికైనా నేతలు స్పందించాలి. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చొంటున్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి పనిచేయడం లేదు. సోమవారం పదిమంది ఇన్‌ఛార్జి మంత్రులు వారివారి జిల్లాల్లో సర్‌పై సమీక్ష నిర్వహిస్తారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న చోట వారు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తాం. సర్‌పై పర్యవేక్షణకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా ఉన్న వారు ఎప్పటికప్పుడు కిందిస్థాయి నేతలతో సమన్వయం చేసుకోవాలి. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్పొరేషన్ ఛైర్మన్లు.. బీఎల్ఏల నివేదికలను పరిశీలించాలి. కేవలం బీఎల్‌వో నివేదిక మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయి. బీఎల్ఏలను నాయకులు సమర్థంగా ఉపయోగించుకోవాలి. బీఎల్ఏలు, బీఎల్‌వోల నివేదికలను గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన బృందం ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఇన్‌ఛార్జి మంత్రులు వారివారి జిల్లాల్లో సర్ తీరును పూర్తిగా పర్యవేక్షించాల్సిందే. అన్నింటికీ వారిదే బాధ్యత. ఈ నెల 30న మళ్లీ పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తాం.



అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తీసుకుంటాం. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులతో మాట్లాడాలి. ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టి సారించాలి" అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. "సర్ ప్రక్రియ పార్టీకి చాలా కీలకమైనది. చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదు. నాయకులందరూ వారివారి నియోజకవర్గాలలో దీనిపైనే ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు.. బీఎల్ఏలకు సహకారం అందించాలి. ఇతర రాష్ట్రాలలో సర్ వల్ల జరిగిన నష్టాలను గుర్తించి ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోవద్దు. బాగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం కల్పిస్తాం" అని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, సమన్వయకర్తలు జూమ్ సమావేశంలో పాల్గొన్నారు.





# సాగునీటి సంస్థల బలోపేతానికి కార్యాచరణ

**నిధుల సమీకరణకు కొత్త ప్రణాళిక**

**నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ వెల్లడి**

మంత్రి మాట్లాడుతూ..'సంస్థల రుణభారం తగ్గించి, తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు సమీకరించేలా 10రోజుల్లో సమగ్రఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలి. రాష్ట్ర బడ్జెట్‌పై ఆధారపడకుండా సాగునీటి సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించేందుకు కొత్త ఆర్థిక నమూనాలను రూపొందించాలి. ప్రాజెక్టులకు సంబంధించిన ఖాళీ భూముల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం లేదా లీజుకు ఇచ్చి ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలి. నిజాంసాగర్‌తో పాటు ఇతర జలాశయాల పరిసరాల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలి. అన్ని ప్రతిపాదనలను చట్టపరంగా పరిశీలించిన తర్వాతే అమలుచేయాలి. 2022-23తో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక సంవత్సరాల చట్టబద్ధ ఆడిట్లను వెంటనే పూర్తిచేయాలి' అని మంత్రి పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ.. 'గతంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరిస్తే ప్రభుత్వంపై పడుతున్న ఆర్థికభారం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం సుమారు 11 శాతం వడ్డీతో ఉన్న రుణాలను తక్కువ వడ్డీకి మార్చితే ఏటా సుమారు రూ.250 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశాలు ఉన్నాయి' అని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన రుణ వివరాలు, వడ్డీ, చెల్లింపులు, పనుల పురోగతి, పూర్తి చేయడానికి అవసరమైన నిధులు తదితర అంశాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి. శాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల పూర్తి వివరాలను 15 రోజుల్లో సిద్ధంచేసి వనరుల సమీకరణకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి' అని మంత్రి అధికారులను ఆదేశించారు.



# రైతుల పాలిట రాక్షసుడు రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని అనంతగిరి జలాశయం(అల్లీపూర్ ఎల్లమ్మగుడి) నుంచి రంగనాయకసాగర్ వరకు 16 కి.మీ. మేర భారాస నాయకులు, రైతులు ఆదివారం 'రైతు మహా పాదయాత్ర' చేపట్టారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి హరీశ్‌రావు చివర్లో కిలోమీటరున్నర పాదయాత్ర చేసి రంగనాయక్‌సాగర్‌పై రైతులనుద్దేశించి మాట్లాడారు. "రూ.35 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పి కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే చేశారు. మూడు పంటలకు ఇవ్వాల్సిన రూ.19 వేల కోట్లు రైతుబంధు ఇవ్వలేదు. ఎరువులకు యాప్ పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి దళారులు, రైస్‌మిల్లర్ల చేతుల్లో తోలు బొమ్మ అయ్యారు. రైతులకు రుణమాఫీ చేస్తానని భద్రాద్రి రాముడు, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కొమురవెల్లి మల్లన్న, జహంగీర్ పీర్ దర్గా, మెదక్ చర్చి, ఏడుపాయల అమ్మవారిపై ఒట్టు పెట్టి మాట తప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలు దేవుళ్లపై ఒట్టు పెట్టి మాట తప్పడం వల్ల మళ్లీ కరవు వచ్చింది. ఎల్లంపల్లిలో నీరు లేకపోతే హైదరాబాద్‌కు మంచి నీరు సరఫరా ఉండదు. కరవులో మీట నొక్కకపోతే తాగునీరందక ప్రజలు ఆగమవుతారని విశ్రాంత ఇంజినీర్లు సీఎంకి సూచిస్తే జైల్లో పెడతా, బెల్టుతో కొడతా అంటూ బెదిరించారు. మేడిగడ్డ వద్ద నీళ్లు ఉన్నాయని చెబుతున్నా మీట నొక్కలేదు. ఇప్పుడు 16 వేల క్యూసెక్కులు మాత్రమే పోతున్నాయని మంత్రి ఉత్తమ్ అంటున్నారు.. మొన్నటి దాకా లక్ష క్యూసెక్కులు పోయినప్పుడు ఎందుకు నొక్కలేదు? ఆగస్టులో లక్ష నుంచి 3 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది. కనీసం అప్పుడైనా మీట నొక్కడానికి అన్నారం, సుందిళ్లను సిద్ధంగా ఉంచి ప్రజలను కాపాడాలి. కాళేశ్వరంతో కేసీఆర్‌కు పేరు వస్తుందని విచారణలు, కేసులు పెడుతూ ఇబ్బంది పెట్టడం సరికాదు. శాస్త్రవేత్తలు ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందు నుంచే హెచ్చరిస్తున్నారు.. కరవు వస్తే పూర్తి బాధ్యత రేవంత్‌రెడ్డి వహించాలి" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో భారాస నాయకులు రాధాకృష్ణ శర్మ, పాల సాయిరాం, మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లాయి

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ**

**చర్యలు చేపట్టాలని కేంద్రానికి లేఖ**

**హైదరాబాద్:** రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లాయని, విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రాన్ని కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌కు బహిరంగ లేఖ రాశారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు.. తాగునీరు, పారిశుద్ధ్యం, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ మౌలిక సదుపాయాలు, ప్రజా ఆస్తుల నిర్వహణ వంటి నిర్దేశిత పనులకే వినియోగించాల్సి ఉంటుంది. తెలంగాణలో ఈ నిధులను నిర్దేశిత లక్ష్యాలకు భిన్నంగా ఖర్చు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. గ్రామాభివృద్ధి పనులకు వినియోగించకుండా సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు, సాధారణ నిర్వహణ ఖర్చులు, ఇతర పరిపాలన అవసరాలకు మళ్లిస్తున్నట్లు గ్రామ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మౌఖిక ఆదేశాలతో గ్రామ సర్పంచులపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులను ఇతర ఖర్చులకు వినియోగించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా తాగునీటి పథకాలు, పారిశుద్ధ్య పనులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ ఈ ఏడాది ఇప్పటివరకు విడతలవారీగా రూ.2,293.74 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ చేసింది. మరో రూ.729.41 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తున్న క్రమంలో తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి" అని లేఖలో పేర్కొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ తీసుకొస్తాం

**నిపుణుల సూచనల మేరకే కాళేశ్వరంపై నిర్ణయం**

**ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ**



**కరీంనగర్ :** ప్రజా ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎలాంటి పట్టింపులు, భేషజాలు లేవని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిపుణులతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారని, ప్రాణహిత నుంచి వచ్చిన రెండు రోజుల వరద ఉద్ధృతి ప్రస్తుతం 16 వేల క్యూసెక్కులకు తగ్గిందని చెప్పారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎల్‌నినో తీవ్రత తగ్గించే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు అంతా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) పర్యవేక్షణలో ఉంది. మేము ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం లేదు. గతంలో సాహసాలు చేసిన వాళ్లు ఏం చేశారో మేడిగడ్డ రూపంలో అందరం చూశాం. నిపుణులకు అర్ధరాత్రి మొదలు పెట్టాలని చెప్పినా మేము నీటి ఎత్తిపోతకు సిద్ధంగా ఉన్నామని సీఎం ఇప్పటికే స్పష్టం చేశారు' అని తెలిపారు. 'ఉద్యోగాల భర్తీపై యువతను పక్కదారి పట్టిస్తూ కేటీఆర్ రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం ఎందుకు గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదు? కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తే.. అడ్డుకునేందుకు భారాస కుట్రలు చేసినా వెనక్కి తగ్గకుండా దాదాపు 600 మంది నియామక ప్రక్రియ పూర్తి చేశాం. భారాస హయాంలో పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను పల్లీ బఠానీల్లా లీక్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను తీసుకొస్తాం. ఏ ఉద్యోగాలు ఎప్పుడు, ఏ విధంగా భర్తీ చేయాలనే అంశంపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# జమ్మూ కశ్మీర్‌లో ఆకస్మిక వరదలు



**12 మంది మృతి**

**ఒకే కుటుంబంలో 8 మంది బలి**

**దిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఆదివారం 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా ఆయన తన వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పార్క్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఆయనకు చెందిన మూడంతస్తుల భవనం మట్టి, బురదలో కూరుకుపోయింది. దీంతో అందులోని 8 మంది కుటుంబసభ్యులు మరణించారు. లతీఫ్‌తో పాటు అతని పెద్ద కుమారుడు మాత్రమే బతికి బట్టకట్టారు. ప్రమాదం సమయంలో లతీఫ్ కుమారుడు జమ్మూలో ఉన్నారు.



# అవినీతిని నిర్మూలిస్తే ఉచితాలు సాధ్యమే: కవిత

**జగిత్యాల :** అవినీతిని..నిర్మూలిస్తే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం వంటి పథకాలు అమలు చేయడం సాధ్యమేనని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో నిర్వహించిన పాంచజన్య సంకల్పసభలో కవిత మాట్లాడుతూ.. "ప్రపంచ మేధావులతో మాట్లాడి పాంచజన్య పేరుతో ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం వంటి పథకాలతో ప్రజల ముందుకొచ్చాం. ఉచిత విద్య, వైద్యం సాధ్యం కాదని పలువురు నాయకులు విమర్శిస్తున్నారు. అవినీతిని నిర్మూలిస్తే.. ఇప్పుడున్న రాష్ట్ర బడ్జెట్‌తోనే వాటిని అమలు చేయవచ్చు. ఎల్‌నినో ప్రభావముంటుందని ఆర్నెల్ల కిందటే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదు. రాష్ట్రంలో 57 రిజర్వాయర్లలో 418 టీఎంసీల నీరు నిల్వ చేసే అవకాశమున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం కేవలం 93 టీఎంసీలు మాత్రమే ఉండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పేలా లేవు. సాగునీరు, ఉద్యోగాల కల్పన విషయంలో భారాస, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు ఎదురుదాడి చేసుకుంటున్నారు.. తప్పితే రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదు" అని పేర్కొన్నారు.



## మేడ్చల్ సీఐ అంజిరెడ్డిని కలిసిన
# క్యూ6న్యూస్ చైర్మన్
### శుభాకాంక్షలు తెలిపిన జిఎన్ఆర్

**మేడ్చల్, జూలై 19 (జనం వార్త) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ సీఐ గా బి.అంజిరెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. లింగంపల్లి ఎస్ఓటి ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తించిన ఆయన అక్కడ నుండి బదిలీ పై మేడ్చల్ సర్కిల్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బాధితులు చేపట్టిన సిఐని క్యూ6 న్యూస్ చైర్మన్ జి.ఎన్.ఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సిఐ అంజిరెడ్డికి శాల్వాను కప్పి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.



## ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుడుం రమేష్ బాబు జన్మదిన వేడుకలు

**మేడ్చల్ :** మేడ్చల్ మండల ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుడుం రమేష్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి రమేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కోసం, దళిత బహుజనుల హక్కుల కోసం రమేష్ బాబు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ, ప్రజల సేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ స్థానిక నాయకులు కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, స్వామి, నరేందర్, నరేష్, సుధాకర్, నవీన్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



## ఇరాన్ నిర్ణయాన్ని ఖాతరు చేయను: డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవగాహన ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉండకపోవడాన్ని పెద్దగా పట్టించుకోనని అన్నారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేయకుండా నిలువరించాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఒక న్యూస్ ఛానల్‌తో వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన ఎంవోయూ నుంచి వైదొలగుతున్నట్లు టెహ్రాన్ చేసిన ప్రకటనపై మీరేమంటారు అని విలేకరి ప్రశ్నించగా.. అలాంటి చర్యలను ఖాతరు చేయ-బోనన్నారు. పాక్ మధ్యవర్తిత్వంతో అమెరికా- ఇరాన్ మధ్య జూన్ నెలలో తాత్కాలిక అవగాహన ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. 14 పాయింట్లతో కూడిన ఎంవోయూపై ఇరుదేశాల అధ్యక్షులు సంతకాలు చేశారు. ఆ తర్వాత రోజుల వ్యవధిలోనే హర్మూజ్ కేంద్రంగా మళ్లీ ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దాని నిర్వహణపై పట్టు సాధించేందుకు అమెరికా, ఇరాన్ ప్రయత్నించడంతో పరిస్థితులు మొదటికి వచ్చాయి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలను అమెరికా లక్ష్యంగా చేసుకోగా.. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను టెహ్రాన్ టార్గెట్ చేస్తోంది.




## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సోనమ్ వాంగ్‌చుక్ భార్య

**ఢిల్లీ :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన భర్తను వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఆయనను అక్రమంగా నిర్బంధించారని పిటిషన్‌లో ఆరోపించారు. ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యులు, న్యాయవాదులను కలిసే అవకాశం కల్పించాలని కోరారు. 21 రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్షా శిబిరం నుంచి పోలీసులు వాంగ్‌చుక్‌ను శనివారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ కూడా ఆయన దీక్ష కొనసాగిస్తున్నారని ఆంగ్మో తెలిపారు. చికిత్స విషయంలో పారదర్శకంగా వ్యవహరించడం లేదన్నారు. సదరు ఆసుపత్రిపై తమకు నమ్మకం పోయిందన్నారు. డిశ్చార్జ్ చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని కోరినా అధికారులు నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ తనపై ఆంక్షలు విధించారని చెప్పారు. వంద మందికి పైగా పోలీసులు ఆసుపత్రిలో మోహరించారని.. వాంగ్‌చుక్ ఉన్న అంతస్తులోనే 30 మంది సిబ్బంది ఉన్నట్లు పేర్కొన్నారు.

## శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన
# జెండా ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి, జూలై 19(జనం వార్త):** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియం వద్ద ఆదివారం తెలంగాణ రక్షణ సేన జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ







కార్యకలాపాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ముఖ్యంగా యువత, మహిళలు తెలంగాణ రక్షణ సేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ అస్లాం, విష్ణు చారి, మురుగేషన్ వేలు, దయానంద్ ముదిరాజ్, లక్ష్మి, మాధవి, సందీప్, ప్రవీణ్, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తే
# కాంగ్రెస్ ప్రభుత్వానికీ అదే గతి తప్పదు

- డాక్టర్ చీమ శ్రీనివాస్
- ఎల్లంపేట పురపాలక సంఘం అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి సుదర్శన్
- కేకే కమిటీ పేరుతో కాలయాపన వద్దు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 20% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- కేసీఆర్ సర్కార్‌ను ముంచింది ఉద్యమకారుల శాపమే
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీ నియామకం

**మేడ్చల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను ధారబోసిన ఉద్యమకారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించవద్దని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ఒక ఫామ్ హౌస్‌లో తెలంగాణ ఉద్యమకారుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా, సత్వరమే అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో 20% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమకారులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్ని పార్టీల్లోనూ దశాబ్దాలుగా శ్రమించిన ఉద్యమకారులకు సరైన గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ రాజకీయ పార్టీలు ఈ డిమాండ్‌ను పక్కనబెడితే, ఉద్యమకారులంతా ఏకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా (ఇండిపెండెంట్లుగా) బరిలోకి దిగుతామని ఆయన హెచ్చరించారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను



అమలు చేయాలి. రాష్ట్రం కోసం సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు.

### కేసీఆర్ సర్కార్ కు పట్టిన గతే పడుతుంది..:

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ఆయన ఈ సందర్భంగా తీవ్ర విమర్శలు చేశారు. "కేసీఆర్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకునే నాడు ఉద్యమించాం, ఆయన వల్లే రాష్ట్రం వచ్చిందన్న మాట నిజమే. కానీ, అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారు. ఆ పాపమే వారిని ఈ రోజు అధికారానికి దూరం చేసింది" అని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పు పునరావృతం చేయకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారుల సంక్షేమానికి తక్షణమే నిధులు, పథకాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి ఎల్లంపేట పురపాలక సంఘం అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి సుదర్శన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పీట్ల సాయిలుకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు సత్తి రెడ్డి, తలారి అశోక్ ముదిరాజ్, జక్కుల కుమార్, రాంచందర్, యాదయ్య, బాలరాజు, బిక్షపతి, చందర్, కురకుల మహేష్, తలారి ప్రభాకర్, ఎండీ రఫీక్, జి.అశోక్, సాయిబాబు, టీ లక్ష్మణ్, రెడ్డి నాయక్, లింగం గౌడ్, మీట్యా నాయక్, భాస్కర్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు
# అందించడమే లక్ష్యం
### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, జూలై 19(జనం వార్త):** తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థ విజయ డైరీ విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందించడంతో పాటు పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డైరీని ప్రజలు ఆదరించి, ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా సంస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న రోజుల్లో పీజేఆర్ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. విజయ డైరీలో పనిచేసే సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ



నాణ్యమైన సేవలు అందించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, రఘునాథ్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, నాగేందర్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## విలీనమై ఇన్ని రోజులైనా డీఆర్డీఏ, డీపీఓలు అవసరమా...?

- పీ.ఆర్, రోడ్లు భవనాల శాఖలు ఇక్కడ ఎందుకో..?
- జెడ్పీ రద్దైనా సీ.ఈ.ఓ ఇక్కడే..!
- మేడ్చల్ జిల్లా ఆర్థిక అంశాలపై ప్రతికూల ప్రభావం
- జిల్లా ప్రజా సంఘాల విమర్శ

**మేడ్చల్ :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ఇంకా గ్రామీణాభి వృద్ధి సంస్థ ను కొనసాగించడం ( డీ ఆర్డీఏ) అవసరమా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా మొత్తాన్ని పట్టణీకరణ చేసినా, జిల్లా డీ.ఆర్.డీ.ఏ ను ఎత్తివేయకపోవడంలోని ఆంతర్యాన్ని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.. కార్పొరేషన్ లో విలీనమైనప్పటికీ డి.ఆర్.డి.ఏ, పంచాయతీ శాఖను ( డీ.పీ.వో ను, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖను, ఆర్ అండ్ బి శాఖలను, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందినీ కొనసాగించడం, వారికి వృథాగా వేతనాలు, టి.ఏ, డీ.ఏ లు చెల్లించడం, జిల్లాలోని నిధులను వృథా చేయడం తప్ప మరొకటి కాదన్న విమర్శలు వినిపిస్తున్నారు.

### మేడ్చల్ జిల్లాను జీ.హెచ్.ఎం.సి లో విలీనం:

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాను గత సంవత్సరం జీ.హెచ్.ఎం.సీ లో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీనితో, అప్పటి వరకు గ్రామీణ ప్రాంతంగా ఉన్న మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మొత్తంగా పట్టణ ప్రాంతంగా రూపాంతరం చెందింది. మేడ్చల్ జిల్లా కొత్తగా ఏర్పడినప్పుడు 2016 లో 15 మండలాలు, 61 గ్రామ పంచాయతీలు 9 మున్సిపాలిటీలు, 4 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండేవి. ప్రభుత్వ విలీన నిర్ణయంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతం మొత్తంగా జీ.హెచ్.ఎం.సీలో విలీనమైంది. దీనితో, డీ.ఆర్.డీ.ఏ, పంచాయతీ శాఖ, పంచాయతీ ఇంజనీరింగ్ శాఖ, రోడ్లు, భవనాల శాఖలు సైతం కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లిపోయాయి. ఇదంతా జరిగి సంవత్సరం పైగానే జరిగింది. అయినా, ఆ శాఖల కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది ఇంకా జిల్లా కలెక్టరేట్ లోని కొనసాగుతున్నాయి. అధికారులు, సిబ్బంది వేతనాలు జిల్లా ఖజానా నుంచే చెల్లిస్తున్నారు.

### విధుల విషయంలో కొనసాగుతున్న అసందిగ్ధత :

మేడ్చల్ జిల్లా కార్పొరేషన్ లో విలీనమైన తర్వాత జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ (డి.ఆర్.డి.ఏ ) ను పట్టణ పేద రిక సంస్థ ( మెప్మా ) లో కలిపి వేశారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లిపోయాయి. అయినా, డి.ఆర్.డి.ఏ సంస్థ అధికారి, జెడ్పీ సీఈఓ, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి, రోడ్లు భవనాల శాఖ అధికారి పోస్టులు, సిబ్బంది పోస్టులు అలాగే కొనసాగుతున్నాయి. వేతనాలు ఇక్కడి నుంచే తీసుకుంటున్నారు. అయితే, సరైన పనులు లేక కాలక్షేపం కోసం కార్యాలయానికి వచ్చి, వెళ్ళడం తప్ప ఏమీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ జిల్లా నుంచి స్వయం సహాయక సంఘాలు మెప్మాలో విలీనమై సంవత్సరం గడిచినా, మెప్మాకు ఇప్పటి వరకు సొంత అధికారి లేరు. ఇంతకు ముందు ఉన్న అధికారులు అవినీతి కి పాల్పడి సస్పెండ్ కు గురైన విషయం తెలిసిందే. ఇక డి.ఆర్.డి.ఏ – పీడీ నే మెప్మా ఇంచార్జ్ పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే, విలీనమైన సంఘాల సభ్యులకు ఇంతకు ముందులా ఇటు డి.ఆర్.డి.ఏ నుంచి గానీ అటు కార్పొరేషన్ నుంచి గానీ సరైన సహకారం అందడం లేదన్న విమర్శలు మాత్రం వెల్లువెత్తుతున్నాయి.

### డిఆర్డీఏ లో 5గురు డీ.పీ.ఎం లు వృథాగానే ...?

ప్రస్తుతం డీ.ఆర్.డీ.ఏ లో డి.ఆర్.డి.వో తో పాటు ఐదుగురు డీ.పీ.ఎం లు పని చేస్తున్నారు. ఇందులో, బ్యాంక్ లింకేజీ రుణాలు, సదరం క్యాంపులు, సంఘాలకు జీవనాధికి ఒక్కరు, పించన్ల మంజూరుకు మరొకరు, ఫామ్, నాన్ ఫామ్ లైవ్లీ వుడ్ కల్పనకు చెరొక్కరు, సంఘాల ఫైనాన్స్ అంశాలు చూడటానికి వేరొకరు ఉన్నారు. ప్రస్తుతం డీ.ఆర్.డీ.వో తో పాటు ఐదుగురు డీ.పీ.ఎం లకు సంబంధించి విధుల విషయంలో క్లారిటీ లేదు. అలాగే, రోడ్లు భవనాల శాఖ అధికారి, పంచాయతీ రాజ్ ఇంజనీరు, జెడ్పీ సీఈఓ ల విషయం లోనూ అంతే. ఈ శాఖలు గ్రేటర్ లో విలీననానికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ ను శాతం విడుదల చేసి సంవత్సరం పై గానే గడిచింది. అయినా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది ఆ శాఖల పరిస్థితి. ఉన్నతాధికారులు నాకేమి సంబంధం అని ఎవరికి వారు బావిస్తుండటం మూలంగా మేడ్చల్ జిల్లా ఆర్థిక అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న విషయం స్పష్టం.

శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా మంది వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. సాధారణంగా మనం వాకింగ్ చేస్తున్నప్పుడు కాళ్లు, తొడలు, పిరుదులు వంటి భాగాల్లో నొప్పి వస్తూ ఉంటుంది. ఇది అడపాదడపా జరుగుతుంది. కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత తగ్గిపోతుంది. కానీ వాకింగ్ చేసేటప్పుడు కాళ్ల నొప్పి ఎక్కువగా ఉండడం, విశ్రాంతి తీసుకున్న తరువాత కూడా తగ్గకపోవడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను కూడా సూచిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఎక్కువగా ఎటువంటి లక్షణాలు చూపించదు. వాకింగ్ చేసేటప్పుడు మన శరీరం కొన్ని లక్షణాలను చూపిస్తుంది.



# అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉందా..?

## ఈ లక్షణాన్ని గమనించండి..!



### కొలెస్ట్రాల్ అడ్డుపడితే..

ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుపడడం వల్ల నడిచిన ప్రతిసారి నొప్పితో పాటు వింత అనుభూతి కలుగుతుంది. ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుగా ఉండడం వల్ల నడిచేటప్పుడు ఆక్సిజన్ ఉన్న రక్తం సరిగ్గా సరఫరా అవ్వదు. దీంతో నడిచేటప్పుడు నొప్పితో పాటు కాళ్లు బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెట్లు ఎక్కడం కూడా కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలక్రమేణా రక్తప్రసరణ బలహీనపడుతుంది. కండరాలు కుచించుకుపోతాయి. కొంతకాలానికి నడవడం, నిలబడడం కూడా కష్టతరంగా మారుతుంది. అంతేకాకుండా నడిచిన తరువాత ఒక కాలు చల్లగా మరో కాలు వేడిగా ఉండడం వంటి లక్షణాలు కూడా ధమనుల్లో అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. రక్తం వెచ్చగా ఉంటుంది. రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కాలు తగినంత వేడెక్కక చల్లగా ఉంటుంది. నడిచిన తరువాత కాలు చల్లగా ఉండడం, కాలు రంగు మారడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.



### కాళ్లల్లో తిమ్మిర్లు, గుచ్చినట్లుగా ఉండడం..

అలాగే నడిచేటప్పుడు కాళ్లు తిమ్మిర్లు రావడం, గుచ్చినట్టుగా ఉండడం కూడా ఒక సంకేతమే. నడిచేటప్పుడు నరాలకు ఆక్సిజన్ తో కూడిన రక్తం నిరంతరం సరఫరా అవ్వాలి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల రక్తం సరఫరా అవ్వక నరాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో పాదాల్లో తిమ్మిర్లు, మంట, స్పర్శ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసేకొద్దీ పాదాలపై అల్సర్లు, ఇన్ఫెక్షన్లు, పాదాలపై నెమ్మదిగా గాయాలు అయ్యే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పాదాల రంగు మారడం..

అలాగే అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారిలో నడిచిన తరువాత పాదాల రంగు మారుతుంది. చర్మం పాలిపోయినట్టు కనబడడం, నీలి లేదా ఊదా రంగులో కనబడడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల చర్మ కణజాలానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. సమస్య పెరిగే కొద్ది కాళ్లపై వెంట్రుకలు ఊడిపోవడం, కాలి వేళ్లపై, పాదాలపై నయం కాని పుండ్లు పడడం కూడా జరుగుతుంది. కనుక నడిచే సమయంలో ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అధిక కొలెస్ట్రాల్ సమస్య గుండె జబ్బులకు, స్ట్రోక్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. కనుక అధిక కొలెస్ట్రాల్ సమస్యను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

**"అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని మన సంస్కృతి చెబుతుంది. అదే అన్నం నేడు అనేక కుటుంబాల్లో ఆందోళనకు కారణమవుతోంది. మన పళ్లెంలోకి చేరేది నిజంగా పోషకాహారమా.? లేక నెమ్మదిగా శరీరంలో చేరి క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే రసాయన అవశేషాలా.? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది. పొలం నుంచి పళ్లెం వరకు చేరే ఆహారంలో పెరుగుతున్న రసాయన అవశేషాలు ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దిగుబడుల పెరుగుదల అవసరమే. కానీ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సాధించే అభివృద్ధి శాశ్వతం కాదు.**

హైదరాబాద్ : అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరగడం వాస్తవం. అయితే వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో, సూచించిన మోతాదుల్లో, సరైన సమయంలో వినియోగించకపోతే పంటల నాణ్యత దెబ్బతినడమే కాదు, ప్రజారోగ్యంపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రైతు ఎక్కువ పండించాలి... దేశానికి ఆహారం సమృద్ధిగా అందాలి. కానీ ఆ ఆహారం సురక్షితంగా ఉండేలా చూడటం రైతు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వం, వినియోగదారులు అందరి ఉమ్మడి బాధ్యత.




### చాపకింద నీరులా విస్తరిస్తున్న క్యాన్సర్ ముప్పు

భారత జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ 2024 నివేదిక ప్రకారం దేశంలో 2024లో సుమారు 14.13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. 2026 నాటికి ఈ సంఖ్య 15.6 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది. పొగాకు, మద్యపానం, కాలుష్యం, జన్యుపరమైన కారణాలు, ఊబకాయం, జీవనశైలి వంటి అనేక అంశాలు క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు. వీటితో పాటు, అనుమతించిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్న పురుగుమందుల అవశేషాలు దీర్ఘకాలం ఆహారం ద్వారా శరీరంలోకి చేరితే ఆరోగ్యపరమైన ప్రమాదం పెరిగే అవకాశం ఉదని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే ప్రతి పురుగుమందే క్యాన్సర్‌కు ప్రత్యక్ష కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. సమస్య రసాయనాల్లో కంటే వాటి దుర్వినియోగంలోనే ఎక్కువగా ఉంది.

# కంచంలో విషం..

## రేపటి తరంపై క్యాన్సర్ పంజా!

**పొలం నుంచి పళ్లెం వరకు పెరుగుతున్న రసాయనాల ముప్పు**

**అధిక దిగుబడుల వెనుక దాగిన ఆరోగ్య సంక్షోభం**

### పంజాబ్ 'క్యాన్సర్ ట్రైన్'... దేశానికి ఒక హెచ్చరిక

పంజాబ్‌లోని మాల్వా ప్రాంతం నుంచి రాజస్థాన్‌లోని బీకానేర్ క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లే రైలును స్థానికులు "క్యాన్సర్ ట్రైన్"గా పిలుస్తారు. భూగర్భ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాలు, జీవనశైలి మార్పులు, రసాయనాల అధిక వినియోగం వంటి అనేక కారణాలు కలిసి ఈ పరిస్థితికి దారితీసినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఒక్క పురుగుమందులనే ఇందుకు కారణమని చెప్పలేకపోయినా, ఆహార భద్రతపై ఇది దేశానికి గట్టి హెచ్చరిక.

### క్షేత్రస్థాయిలో తరచూ కనిపిస్తున్న కొన్ని సమస్యలు:

- సిఫారసు చేసిన మోతాదుకంటే ఎక్కువగా పురుగుమందులు వాడటం.
- ఒకే ట్యాంకులో మూడు నుంచి ఐదు రకాల మందులు కలిపి పిచికారీ చేయడం.
- పిచికారీ చేసిన వెంటనే పంటను కోసి మార్కెట్‌కు తరలించడం.
- ఒకే రసాయనాన్ని పదేపదే వాడటంతో పురుగుల్లో నిరోధక శక్తి పెరగడం.
- గడ్డిమందులను విరివిగా వాడడం
- నకిలీ, నాసిరకం మందుల వల్ల రైతులు నష్టపోవడం.
- వ్యవసాయ నిపుణుల సలహా లేకుండా మందులు వినియోగించడం.

### వెయిటింగ్ పీరియడ్ పాటించడం తప్పనిసరి

ప్రతి పురుగుమందుకు ప్రీ-హార్వెస్ట్ ఇంటర్వెల్ లేదా వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. పిచికారీ చేసిన తర్వాత ఎన్ని రోజులకు పంట కోయాలో మందు లేబుల్‌పై స్పష్టంగా పేర్కొంటారు. ఈ వ్యవధిని పాటించకపోతే పంటలో రసాయన అవశేషాలు పెరిగే అవకాశం ఉంటుంది.మనం తినే పండ్లు, కూరగాయలు, ధాన్యాల్లో అనుమతించిన పరిమితిని మించిన రసాయన అవశేషాలు ఉంటే, అది ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారే అవకాశం ఉంది.

### రైతు బాధితుడు... బాధ్యుడు కాదు

ఈ సమస్యకు రైతును మాత్రమే బాధ్యుడిగా చూపడం సరైంది కాదు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కొత్త తెగుళ్లు, పురుగుల్లో పెరుగుతున్న నిరోధక శక్తి, అధిక సాగు ఖర్చులు, నకిలీ మందులు, సరైన సాంకేతిక సలహాల కొరత రైతును రసాయనాలపై ఆధారపడేలా చేస్తున్నాయి. ఏ రైతూ ప్రజలకు విషం పెట్టాలనే ఉద్దేశంతో పంట సాగు చేయడు.

### ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు

ప్రతి జిల్లాలో అవశేషాల పరీక్షా ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. నకిలీ మందులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలంలో ఉచిత శాస్త్రీయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. సమగ్ర తెగుళ్ల నివారణ విధానాలను విస్తృతంగా అమలు చేయాలి. జీవ ఎరువులు, బయోపెస్టిసైడ్లు, సహజ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వాలి. డ్రోన్ పిచికారీకి ప్రోత్సాహకాలు అందించాలి. ప్రతి రైతుకు సురక్షిత పిచికారీ, వెయిటింగ్ పీరియడ్‌పై శిక్షణ ఇవ్వాలి. ఆహార భద్రత పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి.

### వినియోగదారుల జాగ్రత్తలూ అవసరమే

పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో బాగా కడగాలి. ఉప్పు లేదా బేకింగ్ సోడా కలిపిన నీటిలో 15--20 నిమిషాలు నానబెట్టడం మంచిది. కాలానుగుణంగా పండిన స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. నమ్మకమైన వనరుల నుంచే ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలి.

### సురక్షిత ఆహారమే నిజమైన అభివృద్ధి

అధిక దిగుబడి మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదు. సురక్షితమైన దిగుబడే నిజమైన అభివృద్ధి. రైతు బతకాలి. వినియోగదారుడు ఆరోగ్యంగా ఉండాలి. నేల సారవంతంగా ఉండాలి. పర్యావరణం పరిరక్షించబడాలి. ఈ నాలుగు లక్ష్యాలు కలిసినప్పుడే వ్యవసాయం స్థిరంగా ఉంటుంది. పొలం పచ్చగా ఉండాలి. పంటలు సమృద్ధిగా పండాలి. రైతు సంతోషంగా ఉండాలి. ప్రజల పళ్లెంలోకి చేరేది పోషకాహారమే కావాలి, విషం కాదు. శాస్త్రీయ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగం, అవసరమైన మేరకే పురుగుమందులు, జీవసేద్యానికి ప్రాధాన్యం- ఇవే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు. ఎందుకంటే నేడు మనం పళ్లెంలో వడ్డించేది కేవలం ఆహారం కాదు... రేపటి తరాల ఆరోగ్యం, దేశ భవిష్యత్తు. ఆ భవిష్యత్తును విషంతో కాదు, విశ్వాసంతో నిర్మించాల్సిన బాధ్యత రైతు నుంచి వినియోగదారుడి వరకు మనందరిదీ.



# ఓట్స్‌ను రోజూ తింటే అద్భుతమైన లాభాలు!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.



## బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్దకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నిషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.





# శ్రీవరి సాగు.. లాభాలు బాగు

ఆరుతడి పంటలతో పాటు, శ్రీవరిసాగు సైతం రైతులను లాభాల బాటపట్టిస్తున్నది. కరువులో సైతం శ్రీవరిసాగుతో వరిపంటను అధికంగా దిగుబడి చేయవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. శ్రీవరిసాగు పద్ధతిలో మెళుకువలు పాటిస్తే మంచి పంట దిగుబడిని పొందవచ్చని పేర్కొంటున్నారు. మండలంలో శ్రీవరి సాగును మరింత విస్తరంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీవరి సాగు పై మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించిన సలహాలు, జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

### శ్రీవరిసాగు పొలం తయారీ

సాధారణ వరిలాగే శ్రీవరిసాగుకు పొలం తయారు చేయాలి. వరినాటేందుకు ముందుగా కరిగట్లను సిద్ధం చేసుకుని పొలంలో ఎత్తు పల్లాలులేకుండా పొలం దున్ని సిద్ధం చేసుకోవాలి. పొలం చుట్టూ లోపలి నుంచి చిన్నచిన్న గట్లు వేసుకోవాలి. శ్రీవరిసా గులో పొలం తడిగా, బురదగా పదునుగా ఉండాలి. నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి పొలంలో చిన్నచిన్న లోతైన సేడులను ఏర్పాటు చేసుకుని నాట్లు వేయటానికి పొలం సిద్ధం చేసుకోవాలి.

### నారుమడి తయారు

శ్రీ' పద్ధతిలో వరినారును 8 నుంచి 12 రోజుల్లో నాటాలి. నారు పెంచటంలో తగిన మెళకువలు పాటించాలి. దీనికోసం రెండుకిలోల మేలిరకం విత్తనాన్ని ఒక సెంటుభూమిలో పలుచగా చల్లి, పెంచితే ఎకరా పొలంలో నాటవచ్చు. భూమిని మెత్తగా దున్ని, దుమ్ము చేసి, కొంచెం ఎత్తుగా తయారుచేసి, దానికి చుట్టు కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా నారుమడి చుట్టూ వరిఎండు గడ్డితో కానీ వెదురు బొంగులతో ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత పశువుల ఎరువులను ఒక పొరలాగా చల్లాలి. దానిమీద 24గంటలు నానబెట్టి, మండికట్టిన విత్తనాలను పలుచగా చల్లాలి. విత్తనాలపైన పలుచగా పశువుల ఎరువులను వేసి ఉంచాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. పశువుల ఎరువును వేయాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. దానిపై రోజూ నీరు చల్లుతూ తడపాలి. ఎనిమిది రోజుల్లో వరినారు రెండు నుంచి మూడు ఆకులతో ధృఢంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారును పాతపద్ధతిలో పీకకుండా మట్టితో సహావేరు చేసి ప్లాస్టిక్ ట్రేలలో పొలానికి నారును తరిలించాలి.

### వరినాట్లు వేసే విధానం

నాట్లు వేసేందుకు తయారుచేసిన పొలంలో 25పొడవు, 25 సెం.మీ. ఎడంగా ముందుగా గీతలు గీసుకోవాలి. గీతలు గీసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైగా నాటాలి. బురద మట్టిలో సహా మొక్కలను నాటితే వాటిపై ఒత్తిడిలేకుండా స్థిరంగా బలంగా పెరుగుతాయి. మొక్కలు నాటేటప్పుడు నేల బురదపదు నుగా ఉండాలి. మొక్కలను నిటారుగా, జాగ్రత్తగా నాటితేనే పంట మంచి దిగుబడినిస్తుందని నిపుణులు సూచించారు.

### కాలిబాటలు తీసే విధానం..

శ్రీవరిసాగు పద్ధతిలో ప్రతి 25సెం.మీ.నాట్లు వేయుటకు ముందుగాని 15–20 సెం.మీ. వెడల్పు 15–20 సెం.మీ.లోతులో పొలంలో పొలంలో బాటలు తీయాలి. దీని వలన గాలి, వెలుతురుతో పాటు నీరు పెట్టుకోవటానికి వీలుగా ఉంటుంది. దీంతో రైతుపొలంలో అటూఇటూ తిరిగేందుకు సైతం వీలుగా ఉంటుంది. దీంతో చీడపీడలు సైతం పంటను అంతగా ఆశించవు.

### కలుపు నివారణ

శ్రీపద్ధతిలో నీరు నిలువకుండా చూడటంతో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు రోటరీవీడర్‌తో నాటిన పదిరోజులకొకసారి, ఆ తర్వాత పదిరోజులకొకసారి మరో రెండు నుంచి మూడు సార్లు నేలను వీడర్‌తో ముందుకు, వెనక్కి కదిలించటంతో కలుపు మొక్కలు నేలలో కలిసిపోతాయి. రోటరీవీడర్ వాడకటం వలన వేరుకు బాగా ఆక్సిజన్ అందుతుంది. దీంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది స్థిరీకరిస్తాయి. దీంతో వీడర్‌ను ఉపయోగించే ముందు నీటిని అధికంగా ఉంచాలి. వీడర్‌కు మట్టి అంటుకోదు. వీడర్ తేలికగా తిరుగుతుంది. లేదంటే మిగిలిన కలుపు మొక్కలను తీసివేయాలి.

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

శ్రీవరిసాగులో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుమువంటి సేంద్రియ ఎరువులను వాడటంతో భూసారం బాగా పెరుగుతుంది. పశువుల ఎరువును ఎకరానికి నాలుగు టన్నులను ఉపయోగించాలి. దీంతోపాటు వానపాముల ఎరువులను వాడాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. శ్రీవరి పద్ధతిలో 8 నుంచి 12 రోజుల్లో నారు వేర్లు బాగా అభివృద్ధి చెంది, బలంగా పెరుగుతాయి. దీంతో ముప్పై నుంచి యాభై పిలకలు వస్తాయి.



### నీరు అందించే పద్ధతి

శ్రీవరిపంటకు సాగునీరందించటంలో చాలా జాగ్రత్త అవసరం. నాటిన వరి పిలకలు బాగా వచ్చేందుకు పొలం తడితడిగా పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల్లలో నీరు నిలువకుండా జాగ్రత్త వహించాలి. దీని కోసం ప్రతి రెండుమీటర్లకు 15-20 సెం.మీ. వెడల్పు, 15-20 సెం.మీటర్ల లోతులో సేడులు ఏర్పాటు చేసుకోవాలి. మధ్యమధ్యలో పొలం ఆరితే నీటితో తడుపుతుండాలి. దీంతో పంటవేర్లు ఆరోగ్యంగా బలపడుతాయి. పొలంచుట్టు చిన్నచిన్న ఈనెగట్లు, ఎల్లగట్లు వేసుకోవటం వలన నీటి యాజమాన్యం సక్రమంగా జరుగుతుంది. నీరును పెడుతూ తీయటంతో కలుపు వస్తుందనే భయంతో అధిక నీటిని నిలగడితే పిలకలు రాకుండా పోతాయి. పొలంలో నీటిని బట్టి నీటిని పెట్టడం, తీయటం చేయాలి. తక్కువ నీటితోనే శ్రీవరిసాగు చేయవచ్చును. మూడునాలుగు రోజులకు సాగునీరందిస్తే చాలు శ్రీవరితో అధిక దిగుబడిని పొందవచ్చును.



## జాన్వీకపూర్ తమిళం ఇండస్ట్రీ ఎంట్రీ

జాన్వీకపూర్ ఇప్పటికే..'దేవర', 'పెద్ది' చిత్రాలతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండు సినిమాల్లోని జాన్వీ పాత్ర గ్లామర్‌కే అంకితం కావడంతో ఫ్యాన్స్ నిరుత్సాహం చెందారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ అమ్మడు కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ మేరకు వెబ్‌సిరీస్‌తో జాన్వీ తమిళం ఇండస్ట్రీ ఎంట్రీ ఇవ్వడం విశేషం. 'కురథి' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ వెబ్‌సిరీస్‌కు తమిళ టాప్ డైరెక్టర్ పా రంజిత్ నిర్మించబోతుండగా.. సర్జునమ్ దర్శకత్వం వహించనున్నారని ఇప్పటికే వార్తలు రాగా దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ మాత్రం రాలేదు. ఈ క్రమంలోనే తాజాగా కురథి వెబ్ సిరీస్‌కు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ తమిళ ఒరిజినల్ సిరీస్ నిర్మాణాన్ని ప్రారంభించడానికి నెట్‌ఫ్లిక్స్ సిద్ధమైందని సమాచారం. దీందో త్వరలోనే వెబ్‌సరీస్‌పై అఫీషియల్ అప్డేట్ రావడంతో పాటు షూటింగ్ కూడా స్టార్ట్ చేయనున్నారట మేకర్స్.

## పారితోషకాన్ని పెంచిన భాగ్యశ్రీ బోర్సే

మిస్టర్ బచ్చన్ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, అందులో తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో వరుస అవకాశాలు ఆమెను వరించాయి. అయితే ఆ తర్వాత చేసిన పలు చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ఆమెకు నిరాశే ఎదురైంది. అలాంటి సమయంలో అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన భాగ్యశ్రీ బోర్సేకు మంచి బ్రేక్ దక్కింది. జూలై 10న విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఇందులో ఆమె నటనకు కూడా ప్రశంసలు లభించాయి. ఈ విజయంతో భాగ్యశ్రీ బోర్సే క్రేజ్ ఒక్కసారిగా పెరిగిందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఆమె తన పారితోషకాన్ని కూడా పెంచినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఒక్కో సినిమాకు సుమారు రూ.1.5 కోట్ల పారితోషకం తీసుకున్న భాగ్యశ్రీ బోర్సే, లెనిన్ విజయం తర్వాత రూ.2.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వార్తలు బయటకు రావడంతో మంచి అందం, నటన ఉన్న హీరోయిన్లకు భారీ విజయాలు దక్కితే పారితోషకాన్ని పెంచడం సహజమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.





## అనుపమ ప్రేమ బ్రేకప్!

టాలీవుడ్ అందాల భామ అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2015 సంవత్సరంలో ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చిన అనుపమ, వరుసగా హిట్స్ అందుకుంది. ఈ క్రమంలోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ మోస్ట్ హీరోయిన్ గా కూడా ఆమె ఎదిగారు. తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ దూసుకువెళుతోంది. అలాంటి హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి ఓ షాకింగ్ న్యూస్ వైరల్ గా మారింది. ఆమె ప్రేమ బ్రేకప్ అయినట్టు తెలుస్తోంది. యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్, హీరోయిన్ అనుపమ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారనే వార్త జోరుగా వినిపించిన సంగతి తెలిసిందే. త్వరలోనే పెళ్లి కూడా చేసుకుంటారని ప్రచారం చేశారు. అయితే తాజాగా ఈ ఇద్దరు విడిపోయారనే ప్రచారం ఇండస్ట్రీలో జరుగుతోంది. ఇక నుంచి నా గలాన్ని నేనే ఎంచుకుంటా.. ఎవరి అనుమతులు అవసరం లేదు, భయం లేదు అని తాజాగా అనుపమ ఓ పోస్ట్ పెట్టింది. అటు యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్ ను ఇన్ స్టాలో అన్ ఫాలో కూడా చేసింది. ఈ క్రమంలోనే ఇద్దరికీ బ్రేకప్ అయినట్లు సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు ఫ్యాన్స్.

జనం వార్త



# ఫిఫా విశ్వవిజేతగా స్పెయిన్..

## ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాపై 1-0తో విజయం

## ఫిఫా ప్రపంచకప్ కైవసం

## స్పెయిన్‌కు ఇది రెండో ప్రపంచకప్ టైటిల్



**ఫిఫా ప్రపంచకప్‌ను స్పెయిన్ సొంతం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాపై 1-0తో గెలుపొంది విశ్వవిజేతగా నిలిచింది. ఇరుజట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలకపోవడంతో.. ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. ఈ క్రమంలోనే 106వ నిమిషంలో స్పెయిన్ ఆటగాడు ఫెర్రాన్ టొర్రెస్ గోల్ కొట్టాడు. స్పెయిన్‌కు ఇది రెండో ప్రపంచకప్ టైటిల్.**

గతంలో 2010లో ఓసారి విజేతగా నిలిచింది. గత టోర్నీలో ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగాక, పక్కా ప్రణాళికలతో అడుగులేస్తూ 2023 నేషన్స్ లీగ్, 2024 యూరో కప్ గెలిచిన స్పెయిన్.. ఇప్పుడు ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. వరల్డ్‌కప్ విజేతగా రూ.420 కోట్ల ప్రైజ్‌మనీ దక్కించుకుంది. రన్నరప్ అర్జెంటీనా రూ.277 కోట్లు సొంతం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ ఆటగాళ్లు స్పష్టమైన ఆధిక్యం కనబర్చారు. బంతిని 68 శాతం తమ నియంత్రణలోనే ఉంచుకున్నారు. గోల్‌పోస్ట్ వైపు 11 షాట్లు సంధించారు. అయితే.. అర్జెంటీనా గోల్‌కీపర్ మార్టినెజ్.. పెట్టని గోడలా మారి, ప్రత్యర్థి గోల్స్‌ను కట్టడి చేశాడు. మరోవైపు.. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండోకు 90౦3 నిమిషంలో రెడ్ కార్డ్ జారీ అయ్యింది. దీంతో ఈ జట్టు 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆట కొనసాగించింది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరు జట్లూ గోల్ కొట్టలేకపోయాయి. దీంతో ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. అదనపు సమయం తొలి అర్ధ భాగంలోనూ గోల్స్ నమోదు కాలేదు. ఎట్టకేలకు 106 నిమిషంలో స్పెయిన్ ఆటగాడు ఫెరాన్ టోరెస్ ఓ గోల్ కొట్టాడు. దీంతో స్పెయిన్ 1-0తో గెలుపొందింది. మైదానంలో స్పెయిన్ ఆటగాళ్లు స్పష్టమైన ఆధిక్యం కనబర్చారు. బంతిని 68 శాతం తమ నియంత్రణలోనే ఉంచుకున్నారు. అదేవిధంగా గోల్‌పోస్ట్ వైపు 11 షాట్లు సంధించారు. అయితే.. అర్జెంటీనా గోల్‌కీపర్ మార్టినెజ్.. పెట్టని గోడలా మారాడు. ప్రత్యర్థి గోల్స్‌ను కట్టడి చేశాడు. మరోవైపు.. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండోకు రెడ్ కార్డ్ జారీ అయ్యింది. దీంతో ఈ జట్టు 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆట కొనసాగించింది. న్యూయార్క్‌లోని మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా జరిగిన ఈ తుదిపోరుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు. తొలి అర్ధ భాగం అనంతరం విరామ సమయంలో ప్రముఖ సింగర్లు షకీరా, జస్టిన్ బీబర్‌లు తమ సంగీత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఫిఫా వరల్డ్‌కప్ చరిత్రలో ఫైనల్ మ్యాచ్ మధ్యలో హాఫ్ టైమ్ షో (సాంస్కృతిక ప్రదర్శనలు) నిర్వహించడం ఇదే తొలిసారి. టోర్నమెంట్‌లో ఉత్తమ ఆటగాడికి ఇచ్చే 'గోల్డెన్ బాల్' అవార్డును రోడ్రీ గెలుచుకున్నాడు. 19 ఏళ్ల పావ్ క్యూబార్సీ 'టోర్నమెంట్ యంగ్ ప్లేయర్' అవార్డును సొంతం చేసుకున్నాడు. గోల్ కీపర్ ఉనై సైమన్‌కు 'గోల్డెన్ గ్లోవ్' అవార్డు దక్కింది.

# మూడో వన్డేలో భారత్ ఓటమి




## సిరీస్ ఇంగ్లాండ్ వశం

## రోహిత్ సెంచరీ వృథా







లార్డ్స్: భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆతిథ్య ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లిష్ జట్టు 3 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. వన్డేల్లో భారత్‌పై ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు. ఈ భారీ లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా పోరాడి ఓడింది. 7 వికెట్లు కోల్పోయి 360 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (138; 110 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకం వృథా అయింది. విరాట్ కోహ్లీ (66; 58 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (77; 84 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. ఇషాన్ కిషన్ (14), కేఎల్ రాహుల్ (12) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. శ్రేయస్ అయ్యర్ డకౌటయ్యాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కరన్ 4, ఆదిల్ రషీద్, జాకబ్ బెతెల్, జోఫ్రా ఆర్చర్ చెరో వికెట్ పడగొట్టారు. తొలుత ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఓపెనర్ బెన్ డకెట్ (141; 135 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో విరుచుకుపడగా.. మరో ఓపెనర్ జాకబ్ బెతెల్ (91; 93 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ మిస్ చేసుకున్నాడు. జో రూట్ (74లి; 48 బంతుల్లో 9 ఫోర్లు) మరోసారి రాణించాడు. చివర్లో జోస్ బట్లర్ (41లి; 13 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. హ్యారీ బ్రూక్ 14 పరుగులు చేశాడు. చివరి మూడు ఓవర్లలో భారత బౌలర్లు ఏకంగా 62 పరుగులు సమర్పించుకున్నారు. ఇదే టీమ్‌ఇండియా కొంపముంచింది. ప్రసిద్ధ్ కృష్ణ 2, ప్రిన్స్ యాదవ్ ఒక వికెట్ తీశారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com